క్లుప్తంగా

'జీవ వైవిధ్యం కోసం మొక్కలు నాటాలి'



ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: జీవ వైవిధ్యం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని అటవీ రేంజ్ అధికారి రమేష్ అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్ష, అటవీ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అటవీ రేంజ్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వృక్ష, అటవీశాస్త్ర విభాగాల అధ్యాపకులు టి.దినకర్, శ్రీవల్లి, స్వాతి, శ్రీలత, వెన్నెల వర్షిణి, రమణ, జి.శ్రీనివాస్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉపాధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయ్‌కుమార్

కామారెడ్డి అర్బన్: ప్రతి ఇంట్లో అవసరమయ్యే హ్యాండ్ వాష్, లిక్విడ్ సోప్, పౌడర్, ఫ్లోర్ క్లీనర్లు, రూం ఫ్రెషనర్లను లాంటి ఉత్పత్తులపై అవగాహన కల్గి ఉండాలని రిసోర్స్ పర్సన్ పి.జయంతి అన్నారు.దీంతో విద్యార్థి దశ నుంచే ఉపాధి పొందవచ్చన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని నైపుణ్యాలు సాధించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్య, ప్రోగ్రాం కన్వీనర్ జి.మానస, సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, అధ్యాపకులు బి.శారద, కే.శ్రీనివాస్, శ్రీలత, శ్రీనివాస్‌రావు, శ్రీవల్లి, రాజేందర్, పవన్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



ఖలీల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: ఏబీవీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఖలీల్, పట్టణ ఉపాధ్యక్షుడు సంజయ్, నాయకులు రాజు, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్, నాయకులు అశోక్‌రెడ్డి, గోనే‌శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, కన్నయ్య తదితరులున్నారు.

షబ్బీర్ అలీని కలిసిన ఏపీపీ

కామారెడ్డి టౌన్: జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా నియమితులైన దేవుని సూర్యప్రసాద్ శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజగోపాల్‌గౌడ్, మక్సూద్ తదితరులున్నారు.

రైతు శ్రేయస్సు కోసమే సహకార సంఘం



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్

మద్నూర్(జుక్కల్): రైతుల శ్రేయస్సు కోసమే సహకార సంఘం పనిచేస్తుందని మద్నూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో శుక్రవారం 56వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు వానాకాలం పంటల కోసం అవసరమైన ఎరువులు, మందులు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

భోగ్ బండార్‌కు తరలి రావాలి

నిజాంసాగర్(జుక్కల్): ఈ నెల 23 న భోగ్ బండార్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు బానోత్ లోక్యానాయక్ కోరారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం తరుపున పిట్లం లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో జరుపుతున్నామన్నా రు. సమావేశంలో పిట్లం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలరాం, జగ్మల్,దూప్‌సింగ్ తదితరులున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

సాక్షి, నెట్‌వర్క్ : పదో తరగతి పరీక్షలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అన్ని కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను డీఎస్పీ శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించారు. భిక్కనూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు పెద్దమల్లారెడ్డి లోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని పోలీసులకు సూచించారు.



పిట్లంలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



గోపాల్‌పేట మోడల్‌స్కూల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఎల్లారెడ్డి జెడ్పీ బాలికల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రావు



పెద్దమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జీవన ఎరువులను వినియోగించే తీరుపై హైదరాబాద్‌లోని రాజేంద్రనగర వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని పోచారం గ్రామరైతులకు అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) శిబిరంలో భాగంగా నాల్గోరోజు శుక్రవారం విద్యార్థులు గ్రామంలోని పల్లెప్రకృతివనాన్ని శుభ్రం చేశారు. అనంతరం జీవ ఎరువులైన అజోస్పైరిల్లం, అజిటోబాక్టర్, రైజోబియం, పీ.ఎస్.బీ, ట్రికోడర్మ్‌ల ప్రాముఖ్యతను రైతులకు వివరించి వాటిని వినియోగించే తీరును తెలియజేశారు. దీంతోపాటు రసాయన ఎరువులను వినియోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేశారు. కార్యక్రమంలో న్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రమ్య, డాక్టర్ శ్రీరంజిత, డాక్టర పరశురామ్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఫీల్డ్అసిస్టెంట్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సోమారంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రారంభం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సోమారం శుక్రవారం గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కామారెడ్డిలోని ఎస్ఆర్‌కే డిగ్రీ, పీజీకళాశాలకు చెందిన విద్యార్థులు గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, రోడ్డుకిరువైపులలో ఊడ్చడమే కాకుండా మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జైపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ దత్తాద్రి, నవీన్, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో..తాగునీటి సరఫరా



ముత్యంపేటలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలోని హరిజనవాడలో కుళాయి నీరు రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం పంచాయితీ సిబ్బంది వాటర్ ట్యాంకర్‌తో కాలనీలో ఇంటింటికి నీటిని సరఫరా చేశారు. తమ సమస్యను అధికారులు శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలి



మత్తమాలలో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట : ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మత్తమాల, లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ధర్నా చేశారు. ఆశావర్కర్లకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు కల్పించాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని నెలకు రూ. 26వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లింగంపేట మండల ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు స్వరూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తాడ్వాయి/మాచారెడ్డి/రాజంపేట/ఎల్లారెడ్డి: సైబర్ నేరాలు, రోడ్డు భద్రతలపై అవగాహన కలిగి ఉండాలని తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసి మహిళల సమావేశంలో మాట్లాడారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, రోడ్డుభద్రత, మైనర్ డ్రైవింగ్, బాల్యవివాహాలు తదతర వాటిపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ సూచించారు. మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సంఘ అధ్యక్షురాళ్ల సమావేశంలో మాట్లాడారు. రాజంపేట మండల సమాఖ్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలపై గ్రామ సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు రాజంపేట ఏఎస్ఐ సుభాషిని అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఐకేపీ ఏపీడీ మురళి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎంలు మనోహర్, ప్రసన్నరాణి, శ్రీనివాస్, సాయిలు, సీసీలు, మహిళ సంఘాల సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కామారెడ్డి టౌన్ : భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న నిరుపేదల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి, అడిషనల్ కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు మాట్లాడుతూ గ్రామంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ముదాం అరుణ్, నర్సవ్వ, ప్రవీణ్, శ్యామల తదితరులున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు..చిన్నారికి గాయాలు

- కమిషనర్‌కు కాలనీవాసుల వినతి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు అశోక్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డు చౌరస్తాలో నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. శుక్రవారం ఆ రోడ్డులో ఓ వ్యక్తి తన కూతురుతో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా కల్వర్టులో పడి గాయాలపాలయ్యారు. దీంతో స్థానిక కాలనీవాసులు కొందరు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కల్వర్టును పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని కోరారు.



అశోక్‌నగర్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు, గాయపడిన చిన్నారి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను రెవెన్యూ అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, వెంకట్రాంరెడ్డి, సాయి, శ్రీనివాస్, గిర్దావార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: నర్సరీలలో మొక్కలు ఎండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలకు ప్రతి రోజు నీరు పోయాలని నిర్వాహకులకు సూచించారు. గ్రీన్ షెడ్లు చిరిగి పోకుండా చూడాలని అన్నారు. ఎంపీవో ప్రకాష్, పంచాయతి కార్యదర్శి జ్యోతి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో తైబజార్ వేలం



ఎల్లారెడ్డిలో తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్



బీబీపేటలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తైబజార్ వారాంతపు సంత రూ. 7.55 లక్షలకు కోటం వెంకటరమణ దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రోజువారి సంతను సైతం వెంకటరమణ రూ.6.07 లక్షలకు దక్కించుకున్నారు. పశువుల సంతకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరియైన ధర రాక పోవడంతో వేలం పాటను ఈనెల 26కు వాయిదా వేశామన్నారు. మున్సిపల్ మేనేజర్ వాసంతి తదితరులున్నారు.

బీబీపేటలో..

బీబీపేట: మండల కేంద్రంలోని వారాంతపు సంత, రోజు వారి మార్కెట్‌ను పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం పాట వేశారు. గ్రామానికి చెందిన చాట్ల లింగం వారంతపు సంతను రూ. 3,33,000కు, అదే విధంగా రోజు వారి మార్కెట్‌ను రూ. 2,03,000కు సొంతం చేసుకున్నారు. సమావేశంలో కారోబార్ సిద్దరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకొండలో రోజువారి సంత

దోమకొండ: మండల కేంద్రంలో రోజువారి సంత తైబజార్ వేలం పాటను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన గోపాల్ అనే యువకుడు రూ.75వేలకు పాటను దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, గ్రామ పంచాయితీ కార్యదర్శి యాదగిరి, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తుంకిపల్లిలో పనులు ప్రారంభిస్తున్న పిట్లం ఏఎంసీ చైర్మన్ మనోజ్



అన్నాసాగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్/ఎల్లారెడ్డి రూరల్/ దోమకొండ: మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి. మనోజ్‌కుమార్ ప్రారంభించారు. సీసీ రోడ్లు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లకు ఆయన సూచించారు. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్, రేపల్లెవాడ గ్రామాలలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. దోమకొండ మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు గురుప్రతాప్, రామాగౌడ్, గోపి కుమ్మరి రాములు కమ్మరి కృష్ణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి కాంట లక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

అడివిలింగాలలో ఘనంగా బోనాల పండగ



అడివిలింగాలలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అడివిలింగాల గ్రామంలో శుక్రవారం బోనాల పండగను నిర్వహించారు. గ్రామంలోని నల్లపోచమ్మ అమ్మవారికి గ్రామస్తులు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. పిల్లాపాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

వైభవంగా మార్వాడీల శీతల్ ఉత్సవ్



మద్నూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్వాడీ మహిళలు రాజస్థాన్ సాంప్రదాయం ప్రకారం శీతల్ ఉత్సవ్‌ను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం మార్వాడీ మహిళలు స్థానిక పోచమ్మ గుడిలో పిల్లపాపలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోలీ పండగ అనంతరం వారం రోజుల తర్వాత ప్రతి సంవత్సరం శీతల్ ఉత్సవ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. మార్వాడీ మహిళలు పాల్గొన్నారు.

కాలభైరవుడి ఆలయ హుండీ లెక్కింపు



కాలభైరవుడి హుండీని లెక్కిస్తున్న భక్తులు

రామారెడ్డి: మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీకాలభైరవ ఆలయ హుండీని శుక్రవారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, ఈవో ప్రభు గుప్తా పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. రూ.2,62,778 ఆదాయం వచ్చినట్లు విజయరామారావు తెలిపారు. అర్చకులు శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. శబరిమాత దివ్య సమాధి, ప్రతిమ, చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో రాజాగౌడ్ సిద్దిరాంరెడ్డి, బాపురావు, గంగారాం, రాంచందర్, నారాయణరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జూనియర్ లెక్చరర్లు

గాంధారి/ఎల్లారెడ్డి : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పాఠాలు బోధించేందుకు ప్రభుత్వం జూనియర్ లెక్చరర్లను నియమించి ఆయా కాలేజీల్లో పోస్టింగ్‌లో ఇచ్చింది. గాంధారి జూనియర్ కాలేజీకి సివిక్స్ అధ్యాపకురాలిగా మమత, హిందీ అధ్యాపకుడిగా శంభాజీ శుక్రవారం విధుల్లో చేరారు. ప్రిన్సిపల్ గంగారం ఆధ్వర్యంలో అధ్యాపక బృందం, సిబ్బంది వారిని శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వారికి గ్రీన్ ఇంకు పెన్నులను అందజేసి అభినందించారు. అలాగే ఎల్లారెడ్డి జూనియర్ కళాశాలకు హిస్టరీకి శశికుమార్, ఎకనామిక్స్‌కు హారిక, జువాలజీకి రాకేష్, కామర్స్‌కు సుమన్‌లు వచ్చినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



గాంధారిలో అధ్యాపకులకు గ్రీన్ ఇంకు పెన్నులను అందిస్తున్న ప్రిన్సిపల్ గంగారాం

సంక్షిప్తం

కమ్యూనిటీ శానిటరి కాంప్లెక్స్ నిర్మాణం కోసం మార్కింగ్



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్న మెట్ల బావి వద్ద శుక్రవారం కమ్యూనిటీ శానిటరి కాంప్లెక్స్ నిర్మాణం కోసం మార్కింగ్ ఇచ్చినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. బావి వద్దకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం కమ్యూనిటీ శానిటరి కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం రూ.3 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, ఈసీ రాజు, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన యువకుడు

కామారెడ్డి అర్బన్ : పట్టణానికి చెందిన ఓ మహిళకు ఆపరేషన్ కోసం అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో బీజేవైఎం నాయకుడు మ్యాదరి రాకేష్ శుక్రవారం రక్తదానం చేశారు. ఆదర్శంగా నిలిచిన రక్తదాత రాకేష్‌ను రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు, చైర్మన్ రాజన్న, రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ అభినందించారు.

24న కృత్రిమ మేధస్సుపై వర్క్‌షాప్

కామారెడ్డి అర్బన్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24న సోమవారం 'కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆగమనంతో సైన్స్ అండ్ టెక్నాలజీలో విప్లవం'అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్య, సమన్వయకర్త అంకం జయప్రకాష్, కన్వీనర్ రాజేందర్, అధ్యాపకులు శ్రీనివాస్‌రావు శ్రీనివాస్, మానస, శారద, శ్రీలత, రాంప్రసాద్, అనిల్, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు



రాజంపేట : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలపడంతో మండలంలోని ఆర్గొండ, రాజంపేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు సట్టిగారి లక్ష్మీ మాట్లాడుతూ 30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కినందుకు ఆనందంగా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.